కథ

# జీవితమే ఓ ప్రయాణం

-మధురిమ

ఆటో దిగి డబ్బులిస్తుంటే వినిపించింది అనౌన్సుమెంటు. 'గౌతమి ఎక్స్‌ప్రెస్ రెండవ నెంబర్ ప్లాట్‌ఫాం మీదికి వచ్చి వున్నది' అని. వెంటనే వాచీ చూసుకుంది స్రవంతి. బయలుదేరడానికి ఇంకా పది నిమిషాల టైమే మిగిలి వుంది.

సూట్ కేస్ ఓ చేత్తో, ఎయిర్ బ్యాగ్ మరో చేత్తో పట్టుకుని గబగబా స్టేషను వైపు అడుగులేయ సాగింది. ఆమె కంగారుకి తగ్గట్టుగా, చేతిలో బరువులు, ఓవర్ బ్రిడ్జి...ఆ కాస్త టైములో ఎక్కడం కష్టం.

'పది రూపాయల మిగులుతాయి, కాస్త కష్ట పడదాం' అనుకుంటే సెండాఫ్ ఇవ్వడానికి 'అతను' వస్తాడు. ఆయాస పడుతూ మెట్లెక్కి రావడం చూసి ఏమనుకుంటాడు?

బోగీ నెంబర్ చూసి చెప్పింది కాబట్టి, ఈ పాటికి వచ్చే వుంటాడు. తనదే ఆలస్యం. వెంటపడే కూలీకి సామాన్లు అప్పగించింది.

స్టేషన్ అంతా రద్దీగా వుంది. ఇసకేస్తే రాలనట్టు జనం. అందర్నీ తప్పించుకుంటూ బోగీలోకి ఎక్కి, తన సీట్లో కూర్చున్న తర్వాత గాని మనసు కుదుట పడింది గాదు. ఎప్పుడూ తనకి ఇటువంటి హడావిడి తప్పదు. లగేజీ బెర్తు క్రింద సర్దుకున్న తరువాత గాని కంగారు తగ్గింది గాదు.

అప్పటికీ గాని అతడు గుర్తుకు రాలేదు. ఓ సమస్య తీరిన తరువాత మరొకటి.

చుట్టు ప్రక్కల పరిశీలించింది. వచ్చిన జాడలేం కనిపించలేదు. వచ్చే వుంటే ఈ పాటికి తన బెర్తు దగ్గరికి వచ్చే వుండేవాడు. ఈ జన ప్రవాహంలో ఎక్కడని వెతకగలదు? ఎంతమందినని పరిశీలించగలదు?

ఈరోజు కూడా రాలేదా? చివరిగా తను ట్రాన్స్‌ఫర్ మీద వెళ్ళిపోతోంది. చాలా దూరం. ఇకమీద తనను చూడాలంటే చూడగలడా?

అయినా ఆశ. ఒక్కసారి డోర్ దగ్గర నిలబడితేనో! అప్పుడైనా 'తను' అతనికి కనిపించవచ్చు. ఆలోచన వచ్చిందే తడవు...లగేజీని పక్క వాళ్ళకు అప్పగించి డోర్ వద్ద నిలబడింది. అయినా నిరాశే.

తనకి సెండాఫ్ ఇవ్వగలిగే వాళ్ళు ఎవ్వరూ లేరు. తనది ఎప్పటిలా ఒంటరి ప్రయాణమే. మనసు దిగులు పడసాగింది.

దేశంలో ఇతనొక్కడే ఆఫీసరా? దగ్గర వాళ్ళని కూడా కలుసుకోలేని పనులా? నిమిషాలు..సెకెన్లలోకి వచ్చేశాయి. కన్నీళ్ళే తక్కువ. నిరాశలూ..నిస్పృహలూ..తనకు కొత్తేం కాదు.

ఎవరి ఆలోచనలతోనూ తనకేం పని లేదన్నమాట! అనౌన్సుమెంట్ లేకుండానే టైమ్ కాగానే తన దారి తాను చూసుకుంది రైలు.

స్టేషన్‌కే రాని మనిషి...ఇక కనిపించే ఆలోచనే లేదని మనసు నొక్కి చెప్పింది. దిగుళ్ళనీ, బాధల్నీ మనసులోనే నొక్కి పట్టేస్తే కలిగే బాధ..ఒకటి రెండు కన్నీటి బొట్లు రాలి రాలిస్తే కుదుట పడుతుంది అనిపించింది. ఎంత ఏడుద్దాం అనుకున్నా కన్నీళ్ళు రాలేదు. పోనీ బలవంతంగా కన్నీళ్ళు తెచ్చుకుందామన్నా చుట్టు పక్కల వాళ్ళు అడిగే ప్రశ్నలకు ఏమని బదులివ్వగలదు?

'తన వలపుల నేస్తాన్ని వదిలి తనే దూరంగా వెళ్ళిపోతూ బాధ పడుతున్నాననా!'

అప్పటికే రైలు స్టేషను దాటి చాలా దూరం వచ్చి, సిటీ ఔట్‌స్కర్ట్స్ చేరుకుంది. మనసు మాత్రం అక్కడే వుండిపోయింది.

అతని ఆలోచనలతో...కొట్టుకు పోతున్న ఆమెను రైలు కుదుపులు వాస్తవంలోనికి తెచ్చి పడేస్తున్నాయి.

తన పక్కనే కూర్చున్న జంట ఆదే పనిగా కబుర్లు చెప్పకుంటున్నారు.

అతని కాలి మీద ఆమె చేయి, ఆమె చేయి మీద అతని చేయి.

తనకు లేని అవకాశం: మనసు బాధగా మూలిగింది.

అతని కన్నా ఆమె చాలా బాగా మాట్లాడుతుంది. ఆమె చూడడానికి మామూలుగా వున్నా కాస్త ముదురు మొహం. అంత ఆకర్షణీయంగా లేకపోయినా..మాట్లాడే విధానం ఆమె వైపు చూసేలా చేస్తున్నాయి.

అతను ఆమెకన్నా కాస్త చిన్నవాడులా వున్నాడు. టీషర్టు, గుబురు మీసాలతో నిండైన విగ్రహం.

వాళ్ళిద్దరూ ఒకళ్ళ మీద ఒకళ్ళు అలా చేతులు వేసుకుని, చేతులు-చేతులూ రాసాడించుకుంటూ...స్వర్గానందం పొందుతున్న తీరు చూస్తుంటే ...ఎందుకో వీళ్ళు ఒరిజినల్సా! కాదా! అన్న ఆలోచన మొట్టమొదటి సారిగా కలిగింది స్రవంతికి.

కామెర్ల రోగులకు లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్నట్టు సాగుతున్నాయి ఆమె ఆలోచనలు.

'తనూ, తన భర్తా ఎప్పుడైనా ఇలా బాహాటంగా...అందరి ముందూ అలా ఒకళ్ళ మీద ఒకళ్ళు చేతులు వేసుకుని కూర్చున్నారా? వేసుకున్నా పెళ్ళైన ఓ ఏడాది లోపు అలా చేతులేసుకుని కూర్చున్నారేమో!'

ఆ పైన ఎడమొహం..పెడమొహమూనూ..సార పాటున ఎక్కడైనా తగిలినా...ఆమడ దూరాన కూర్చోవడం, ఇంట్లో చాలదా? ఇక్కడ కూడానా! అన్నట్టు.

వీళ్ళదీ తమ వయసు దాంపత్యమే. వీళ్ళలో ఆ ప్రేమలేమిటి? తమ జీవితంలో అటువంటిని 'ఇగిరి' పోవడం ఏమిటి?

ఎదురుగా కూర్చున్న ఆ అమ్మాయి వాగ్ధాటికి అంతే లేదు. ముఖ్యమంత్రి పేషీ విషయాల దగ్గరగి మంచి.. ఇంపోర్టెడ్ కార్ల వరకూ సాగిపోతున్నాయ్.

వాళ్ళ అమ్మకు వచ్చిన కారు ఇంకా మార్కెట్లోకి రాలేదట! అదేదో పేరు చెప్పి "ఏ కంపెనీది అది?" అని అడిగింది.

"తెలీదు" అతడి సమాధానం.

"ఫియట్ కంపెనీది" ఎదురు సీట్లో కూర్చున్న

ఒక యంగ్ హీరో సమాధానం.

వాళ్ళిద్దరూ లోకంతో పని లేదన్నట్టు, తమదే లోకంగా మాట్లాడుకుంటున్నా...ప్రక్కనున్న వాళ్ళకి వాళ్ళ మాటలు ఆసక్తికరంగా, కాలక్షేపంగా వున్నాయి.

మరి కాసేపటికి ప్రక్క బోగీలో వున్న మరొకతను వచ్చి జాయినయ్యాడు వాళ్ళతో.

అతడిని చూడగానే 'రండి' అంటూ ఆమె సీట్లో వెనక్కి జరిగి చోటిచ్చింది. ఆ ఆగంతకుడు వాళ్ళిద్దరికీ మధ్యలో కూర్చున్నాడు. ఆమెలో ఎటువంటి సంశయమూ లేదు. మొహంలో ఏ భావమూ కనపడలేదు.

మధ్యలో ఓ వ్యక్తి వున్నా...కాస్త ముందుకు వంగి ఎప్పటిలానే ఒకళ్ళ మీద ఒకళ్ళు చేతులు వేసుకున్నారు. ఆ ఆగంతకుడు మాత్రం బుద్ధిగా రెండు చేతులూ ఒళ్ళో పెట్టుకుని, వాళ్ళ ప్రేమ కలాపాలకు తల ఆటంకం ఏమీ లేనట్టు మరింత ఒదిగి కూర్చున్నాడు.

రెండు గంటలకు పైగా గడిచిన ప్రయాణంలో స్రవంతి నిర్ధారించుకుంది వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కారని.

ఆనందపడటం కొందరి వంతైతే, బాధపడటం తన లాంటి వాళ్ళ వంతా! మనసు మూగగా రోదిస్తోంది.

లాభం లేదు.

ఇక వీళ్ళని ఆపాలి. లేకపోతే మౌన వేదన భరించడం కష్టంగా వుంది.

"నాకు నిద్రొస్తుందండీ" చెప్పేసింది. ఇలాగైనా వాళ్ళని వేరు చేస్తున్నాను కదా అన్నట్టు.

టైమ్ చూసుకున్నాడతను. పదిన్నర. తప్పదన్నట్టు అయిష్టంగానే బెర్తు వేసుకున్నాను. అయినప్పటికీ మిడిల్ బెర్త్‌లో పడుకున్న ఆమె తల దగ్గర చేరి అరగంట సేపు కబుర్లు చెప్పాడు ఆ యువకుడు.

మెదడులో ఆలోచనలు తొలిచేస్తుండగా ఎప్పటికో నిద్ర పట్టింది స్రవంతికి. చాలా సేపు నిద్ర తరువాత...

మెలకువ వచ్చి చూస్తే...ఆకాశం అరుణిమ దాల్చబోతోంది.. రైల్లో వుండబట్టి తెల్లవారుతున్న భ్రాంతి గాని, ఇంట్లో వుంటే అదేం అనిపించదు.

'ఒళ్ళెరగకుండా ఇంత సేపూ నిద్రపోయానన్న మాట' అనుకుంటూ, బెర్తు కింద వున్న లగేజీ సరిగ్గా వుందో లేదో చూసుకొని, మొహం కడుక్కోడానికన్నట్టు బెర్తు మీది నుంచి లేచింది.

సరిగ్గా..ఎదురుగా...




సైడు లోయర్ బెర్త్ మీద వాళ్ళిద్దరూ...కాస్త ముందూ వెనుకలుగా పడుకుని...మొఖంలో మొఖం పెట్టుకుని .. సైలెంటు ముచ్చట్లు.

అంటే ఏలూరు వచ్చేసిందన్నమాట. ఆ స్టేషనులో ఆ బెర్తులో వున్న తల్లీ, కూతుళ్ళూ దిగిపోతే...ఆ ఖాళీలో వీళ్ళిదద్దరూ సెటిలయ్యారన్నమాట.

వాళ్ళిద్దర్నీ అలా చూడటం చాలా అసహ్యంగా అనిపించింది. మరీ ఇంత పబ్లిక్‌గానా! ఛ! మొహం పక్కకు తిప్పకుంది.

అందరూ మంచి నిద్రలో వున్నారు. తన కదలికల్ని వాళ్ళు గమనించారు.

మొహం కడుక్కుని వచ్చి ముసుగు తన్ని పెట్టి పడుకుంది వాళ్ళ చేష్టల్ని చూడటం ఇష్టం లేనట్టుగా.

మళ్ళీ ఆలోచనలు ముసురుకున్నాయి.

ఎన్ని కబుర్లు చెప్పారు? తోడుగా వచ్చి దిగబెట్టి 'మరీ' వెళుతున్నారు. కానీ...కనీసం స్టేషనుకైనా రాలేదు. మళ్ళీ కావాలన్నా తను కలవలేదు. దూరాన వున్న భార్త కోసం ఇష్టం లేని ట్రాన్స్‌ఫర్.

తనకు అప్పుడప్పుడు దొరికే 'ఆ' మధుర క్షణాలకు దూరమైపోతూ, ఎప్పుడూ ఏడ్చే భర్త తోటే...అసంతృప్తి జీవితం తన ముందు. ఈ వూహే ముల్లులా తూలుస్తోంది. బయట ప్రపంచం కోసమే...మెడలో తాళికి తలవంచవలసి వచ్చింది.

జీవితం పిల్లలతో ముడిపడి వుంది. వాళ్ళ కోసం మనసు చంపుకుని నిర్జీవమైన బొమ్మలా ముందుకు వెళుతోంది.

తెల్లవారింది. వెలుగు రేఖలు బాగా విచ్చుకున్నాయి. చీకటి రాజ్యానికి తెర పడింది. అనైతికం అవతలి గట్టుకి చేరుకుంది.

వాళ్ళిద్దరూ కాస్త దూరంగా జరిగి లగేజీలు చుట్టూ పేర్చుకుని, కబుర్లు చెప్పకుంటున్నారు.

'గోదావరి' స్టేషన్‌లో రైలు గాగింది. ఎందుకు ఆగిందో పావుగంట పైనే ఆగింది. లేదా ఏదైనా లైను క్లియరెన్స్ కోసం ఆగిందో!

అదే పనిగా వీళ్ళ సంభాషణలు వింటున్న పెద్దమనిషి,

"మీరుండేది ఇక్కడకు దగ్గరే అన్నాను కదమ్మా! ఇక్కడ దిగిపోకూడదూ!" అన్నాడు.

"అవునండీ! స్టేషనుకి మావారొస్తారేమోనని చూస్తున్నాను రాలేదు" బయటకు చూస్తూ చెప్పింది.

ఆ సమాధానం అతన్ని మరో మాట మాట్లాడనివ్వలేదు. స్రవంతికి ఆమెను ఎలా అర్థం చేసుకోవాలో అంతకంటే తెలీలేదు. రైల్లో స్నేహం... రైలు దిగేంత వరకే అనుకుందో ఏమో!